మట్టి దొంగలు!



హాజీపూర్ మండలం ముల్కల్లలో మట్టి అక్రమ తవ్వకాల్లో ఇటుకబట్టీల నిర్వాహకులు

నిబంధనలు పట్టవు.. అనుమతులు ఉండవు.. ప్రభుత్వానికి, పంచాయతీలకు చెల్లించాల్సి న రాయల్టీ చెల్లింపులు ఉండవు.. చెరువులు, కుంటల్లో నుంచి అక్రమంగా మట్టి తరలించినా అడిగేవాళ్లు లేరు.. సింగరేణి బొగ్గు.. బట్టీలకు తరలుతున్నా పట్టించుకునే వాళ్లు ఉండరు.. గ్రామాల్లో యథేచ్ఛగా ఇటుకబట్టీలు వెలుస్తున్నా, ఆ పంచాయతీకి రూపాయి రాదు. ఆయా శాఖల అధికారుల సమన్వయలోపంతో పాటు కొంతమంది సహకారంతో జిల్లాలో ఇటుకబట్టీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ దుస్థితిపై కథనం..

- అనుమతులు లేకున్నా దొడ్డిదారిన ఇటుకబట్టీలకు తరలింపు
- అధికారుల సమన్వయ లోపంతో రెచ్చిపోతున్న వైనం
- పంచాయతీల ఆదాయానికి గండి
- జిల్లాలో అత్యధికంగా హాజీపూర్‌లోనే బట్టీల నిర్వహణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇటుకబట్టీల నిర్వహణకు సంబంధిత గ్రామ పంచాయతీతో పాటు, వివిధ ప్రభుత్వ శాఖల అనుమతి ఉండాలి. ఏ గ్రామపంచాయతీ పరిధిలోనైతే ఇటుక బట్టీలు పెడుతారో ఆ పంచాయతీకి ఇటుకల లెక్కల ప్రకారం రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. లక్ష ఇటుక బట్టీ ఏర్పాటుకు ఆ పంచాయతీకి రూ.5వేలు చెల్లించాలని కార్యదర్శులు చెబుతున్నారు. ఆ తర్వాత రెవెన్యూ, ఇరిగేషన్, గనులు, భూగర్భ శాఖలతో పాటు కార్మిక శాఖల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. జిల్లాలో హాజీపూర్‌లో అధికంగా దాదాపు 50వరకు ఇటుక బట్టీలు ఉండగా, చెన్నూరు, జైపూర్ తదితర ప్రాంతాల్లో 20, బెల్లంపల్లి పరిధిలో మరో 21వరకు బట్టీలు ఉన్నట్లు అంచనా. జిల్లా కేంద్రానికి సమీపంలోని హాజీపూర్ మండలం ముల్కల్ల, బుగ్గగట్టు, గుడిపేట తదితర ప్రాంతాల్లో ఇటుక బట్టీల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇందులో కొన్ని బట్టీల యజమానులు ఒకటి, రెండు శాఖల అనుమతులతోనే నెట్టుకొస్తున్నారు. లక్షల్లో ఇటుకలు తయారు చేస్తున్నా, ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ ఆదాయం కోల్పోతుంది. కొన్ని ఇటుకల బట్టీలు ప్రభుత్వ భూములు, చెరువు, వాగుల శిఖం భూముల్లో కొనసాగుతుండటం కొసమెరుపు.

ఇరిగేషన్ పర్యవేక్షణ లేకపోవడంతో..

ఇరిగేషన్ అధికారులు మట్టి రవాణాకు అనుమతులిచ్చారు. ఇదే అదునుగా భావించిన ఇటుక వ్యాపారులు భారీ దందాకు శ్రీకారం చుట్టారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లి నుంచి మట్టిని ఇటుక బట్టీలకు తరలించుకునేలా ఇరిగేషన్‌శాఖ నుంచి అనుమతులు పొందారు. ఈ మట్టి దాదాపు 50టిప్పర్ల వరకు ఉంటుంది. కానీ ఇచ్చిన అనుమతికి మించి వారంరోజుల్లో దాదాపు 350ట్రిప్పుల మట్టిని టిప్పర్లతో ఇటుక బట్టీలకు తరలించారు. మట్టి తరలింపును ఏఈతో పాటు వర్క్‌ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షిస్తారు. వీరి పర్యవేక్షణ లేకపోవడం, వర్క్ ఇన్‌స్పెక్టర్ టిప్పర్లతో పెద్ద ఎత్తున మట్టి తరలించుకునేలా సహకరిస్తున్నట్లు సమాచారం. అంతేకాదు అధికారులు మామూళ్లకు తలొగ్గడంతోనే ఈ అక్రమ మట్టి రవాణా సాగుతోందని తెలుస్తోంది.

నిబంధనలకు పాతర..

ఇటుక తయారీకి చెరువు, కుంటల్లో నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నా పట్టించుకొనే అధికారులు కరువయ్యారు. ఇష్టారాజ్యంగా పచ్చని చెట్లు నరికి బట్టీల్లో వినియోగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బుగ్గగట్టు సమీపంలోని బూసికుంట చెరువు నుంచి మట్టితో పాటు నీటిని దర్జాగా మోటార్లతో దోపిడీ చేస్తున్నారు. ఒరిస్సా, మహారాష్ట్ర తదితర పొరుగు రాష్ట్రాల నుంచి వలస కూలీలు ఇటుక బట్టీల్లో మగ్గిపోతున్నా, కార్మిక చట్టాల జాడ లేదు. సింగరేణి బొగ్గు, రైతులకు ఉపయోగపడే యూరియా రంగు రావడానికి బట్టీల్లో విరివిగా వినియోగిస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఈఈ రామును వివరణ కోరగా జేఈఈ పర్యవేక్షణలో మట్టి రవాణా సజావుగా సాగేలా చూస్తున్నాం. అధిక మొత్తంలో మట్టి కావాల్సి వస్తే, అదనపు లోడ్ కింద డీడీ తీసుకొస్తే ఇటుకబట్టీలకు, మట్టి తీసుకుపోయేలా అనుమతులు ఇస్తాం. పరిమితికి మించి అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంతా బిజీ.. ఇదే అదును

రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలు ధాన్యం తరలింపులో బిజీగా ఉండగా మైనింగ్‌శాఖ మట్టి తరలింపు అసలు పట్టించుకోవడం లేదు. ఇంకేముంది.. ఇదే అదనుగా భావించిన బట్టీల యాజమాన్యాలు అక్రమ మట్టి దందాకు తెరలేపారు. టిప్పర్లు, ట్రాక్టర్లతో ఓవర్‌లోడ్‌తో జాతీయ రహదారులపై రవాణా సాగిస్తున్నాయి. ఇక పోలీసులు సహకరించడం లేదని మైనింగ్ అధికారులు టిప్పర్లను పట్టుకోవడం లేదు. ధాన్యం తరలింపు, లారీలు సమకూర్చడం వంటి పనుల్లో బిజీగా ఉండటాన్ని గుర్తించిన ఇటుకబట్టీ యజమానులు అక్రమ మట్టి రవాణాను అనుగుణంగా మార్చుకున్నారు.



కుప్పలుగా సింగరేణి దొంగబొగ్గు

కలెక్టరేట్ సిద్ధం!

- యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న పనులు
- జూన్ 9న సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి ముహూర్తం ఖరారు

నస్పూర్: జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవనం ప్రారంభానికి సిద్ధమవుతోంది. జూన్ 9న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా భవనం ప్రారంభం దృష్ట్యా భవన నిర్మాణ పనులను అధికారులు శరవేగంగా పూర్తి చేయిస్తున్నారు. నూతన కలెక్టరేట్ భవనంలో రెండు లిఫ్టులను ఏర్పాటు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి, రెండో ఫ్లోర్‌లలో నిర్మించారు. నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. కలెక్టర్ కార్యాలయంలోని వివిధ శాఖల కార్యాలయాలకు కావాల్సిన ఫర్నీచర్ సైతం కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుంది. ఇప్పటికే కలెక్టర్ క్యాంపు కార్యాలయం పూర్తయి ప్రారంభం కూడా అయింది. కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను కలెక్టర్ బాదావత్ సంతోష్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సంబంధిత శాఖల అధికారులను సమన్వయ పరుస్తూ, పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయిస్తున్నారు. కలెక్టరేట్ భవనం పూర్తయి అందుబాటులోకి వస్తే, జిల్లా ప్రజలకు అన్ని రకాల సేవలు ఒకే చోట అందుబాటులోకి రానున్నాయి. దీంతో జిల్లా వాసులకు పరిపాలన మరింత చేరువకానుంది. జిల్లా ప్రజలకు అన్ని రకాల సేవలు ఒకే చోట అందించాలనే ఉద్దేశంతో 2018ఫిబ్రవరి 27న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. భవన నిర్మాణ పనులు సంవత్సర కాలంలో పూర్తి కావాల్సి ఉన్నా, కరోనా, వివిధ కారణాలతో జాప్యం జరుగుతూ వచ్చింది. ఎట్టకేలకు జూన్ 9న సీఎం చేతుల మీదుగా కలెక్టరేట్ భవన నిర్మాణం ప్రారంభానికి ముహూర్తం ఖరారు కావడంతో, జిల్లా వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



భవనం ఆవరణలో కొనసాగుతున్న గ్రీనరీ పనులు

కేటాయించిన స్థలం	-	26.24 ఎకరాలు
(నస్పూర్ శివారు 23, 42, సర్వే నంబర్లు)		
కేటాయించిన నిధులు	-	50.20కోట్లు
భవనం విస్తీర్ణం	-	1,39,458లక్షలు (ఎస్ఎఫ్‌టీ)
కేటాయించనున్న శాఖలు	-	32
స్టేట్ ఛాంబర్ హాల్	-	01
కాన్ఫరెన్స్ హాల్స్	-	03
మీటింగ్ హాల్	-	01
వెయిటింగ్ హాల్	-	01
వీడియో కాన్ఫరెన్స్ హాల్	-	01

రూ.8కోట్లతో నిర్మిస్తున్నవి

కలెక్టర్ క్యాంపు కార్యాలయం	- 1
అదనపు కలెక్టర్ నివాస గృహాలు	- 2
ఉన్నతాధికారులకు క్వార్టర్లు	- 8

- రూ.5కోట్లతో విద్యుద్దీకరణ పనులు చేపట్టారు.



నస్పూర్‌లో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవనం

తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

బెల్లంపల్లిరూరల్: అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు కొయ్యల ఏమాజీ అన్నారు. మండలంలోని బట్వాన్‌పల్లి, పెర్కపల్లి, దుబ్బపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. కొనుగోలు కేంద్రాల్లో, కళ్లాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి బాధిత రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటను ప్రభుత్వం కొనుగోలు చేయడంలో జాప్యం చేయడంతోనే రైతులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు, గన్నీ సంచులు, లారీలు అందుబాటులో లేక ధాన్యం వర్షార్పణం అవుతోందని మండిపడ్డారు. రైతులు ఇబ్బందులు పడుతున్నా, అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని వాపోయారు. తడిసిన ప్రతీ గింజనూ ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎఫ్‌సీఐ సభ్యుడు పులగం తిరుపతి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, నాయకులు అజ్మీరా శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏమాజీ

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన పూజలు

బెల్లంపల్లి: పట్టణంలో శ్రీ విష్ణ్వేశ్వర సహిత ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం రెండోరోజు వైభవంగా నిర్వహించారు. శ్రీ శివభక్త మార్కండేయ గణపతి శారద మాత ఆలయంలో శ్రీ చండీ సప్తశతీ హవనములు, ఏకా శీతి మహాకలశ స్నపనం, ధాన్యాధివాస, పుష్పాదివాస, ఫలాదివాస, వస్త్రాధివాస, శయ్యాధివాసములు, షోఢశ తత్త్వన్యాసములు నిర్వహించారు. భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ఆలయ ప్రాంగణం ప్రతిధ్వనించింది. కార్యక్రమంలో శ్రీ శివభక్త మార్కండేయ గణపతి శారదాంబ సహిత ఆలయ కమిటీ అధ్యక్షుడు గుండేటి సతీష్, ప్రధాన కార్యదర్శి చిదిరాల ఉమాప్రసాద్, ఉత్సవ కమిటీ, మహిళా ఉత్సవ కమిటీ, పద్మశాలి సమాజం శ్రేణులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న పద్మశాలీయులు

ప్రజాగర్జన విజయవంతం చేయండి

పాతమంచిర్యాల: కొత్తగూడెంలో జూన్ 4న సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర ప్రజాగర్జన మహాసభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం జిల్లా నాయకులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ పాలకులు ఆలోచించాలని, బలమైన మతతత్వ పార్టీలను ఓడించడానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీ ఖాన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు మిట్టపల్లి శ్రీనివాస్, రేగుంట చంద్రశేఖర్, మిట్టపల్లి వెంకటస్వామి, జోగుల మల్లయ్య, వీరభద్రయ్య, చిప్ప నర్సయ్య, లింగం రవి, భీమనాథుని సుదర్శన్, బొంతల లక్ష్మీనారాయణ, పెర్క రాజేశం, దేవి పోచన్న పాల్గొన్నారు.

వేమనపల్లి: ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సీపీఐ నాయకులతో కలిసి ప్రజాగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అందె పురుషోత్తం, చిన్న శంకర్, అందె మహేష్, హన్మంతు, దుర్గం శంకర్, కామెర వినోద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలవేన శంకర్

'డబ్బుల సంచులతో వచ్చేవారికి టిక్కెట్ ఇస్తే తిరగబడ్తాం'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి: మరో ఐదారు నెలల్లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి డబ్బుల సంచులతో వచ్చే స్థానికేతరులకు అధిష్టానం టిక్కెట్ కేటాయిస్తే ఊరుకునేది లేదని, తిరగబడ్తామని టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, మహిళాకాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రొడ్డ శారద, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బండి ప్రభాకర్, కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నాతరిస్వామి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్ అన్నారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై కొంత కాలం నుంచి డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మార్గదర్శకత్వంలో పోరాటాలు సాగిస్తున్నామన్నారు. స్థానికంగా ఉండకుండా కొంతమంది డబ్బు బలంతో ఎన్నికల్లో పోటీ చేయడానికి తహతహలాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా కష్టపడి విజయవంతం చేస్తున్నామని, కానీ కొందరు నాయకులు హైదరాబాద్ కేంద్రంగా ఉండి బుద్ధిపుట్టినప్పుడల్లా బెల్లంపల్లికి చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారని, కార్యక్రమాలను, కార్యకర్తలను, ప్రజలను ఏనాడు పట్టించుకోవడం లేదని తెలిపారు. మాజీ మంత్రి వినోద్ ఎన్నికలు సమీపించగానే మళ్లీ బెల్లంపల్లికి రాకపోకలు చేస్తున్నారని, అడపాదడపా తిరుగుతున్నారన్నారు. అలాంటి నాయకుడికి టిక్కెట్ ఇస్తే సహించేది లేదని మండిపడ్డారు. సమావేశంలో ఎంపీటీసీ ముడిమడుగుల మహేందర్, సర్పంచ్ వేముల కృష్ణ, ఎలుక ఆకాష్, మీనుగు సరోజ, మల్లేష్, రాజలింగు, సూరం దామోదర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ లేకుంటే సింగరేణి అధోగతి

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్ రావు

శ్రీరాంపూర్: తెలంగాణ రాకున్నా, ముఖ్యమంత్రిగా కేసీఆర్ లేకున్నా సింగరేణి అధోగతి పాలయ్యేదని మంచిర్యాల శాసనసభ్యులు దివాకర్‌రావు తెలిపారు. ఆర్కే 7గనిపై మంగళవారం ఆయన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణి కార్మికులు అంటే ఎంతో అభిమానం అని, వారి కష్టాలు తెలిసిన కేసీఆర్ జాతీయ సంఘాలు పోగొట్టిన డిపెండెంట్ ఉద్యోగాలను కారుణ్య ఉద్యోగాల పేరుతో ఇప్పించారన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఇప్పటికీ 16,000మంది యువతకు ఇలా ఉద్యోగాలు లభించాయన్నారు. నేడు సింగరేణి గనులను కేంద్రం ప్రైవేటీకరణ చేయాలని చూస్తే కేసీఆర్ అడ్డుకుంటున్నారని తెలిపారు. జాతీయ సంఘాలు కార్మికులకు సాధించి పెట్టింది ఏమీ లేదని, సింగరేణిలో కార్మికులకు టీబీజీకేఎస్ టీఆర్ఎస్‌లో మాత్రమే మేలు చేసిందన్నారు. జూన్ 9న ముఖ్యమంత్రి కేసీఆర్ మంచిర్యాల నూతన కలెక్టరేట్ కార్యాలయాన్ని, పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడానికి వస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నస్పూర్‌లో నిర్వహించే బహిరంగసభకు పెద్ద ఎత్తున కార్మిక వర్గం సమ్మక్క సారలమ్మ జాతరను తలపించే విధంగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, గని ఫిట్ సెక్రెటరీ మెండ వెంకటి, నాయకులు తొంగల రమేష్, రౌతు సత్యనారాయణ, ప్రేమ్ కుమార్, కౌన్సిలర్ వంగ తిరుపతి, నాయకులు రాజేంద్రపాణి, పానుగంటి సత్తయ్య, కమలాకర్ రావు, జక్కుల రాజేశం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దివాకర్‌రావు

అరుణక్కనగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు ఝాన్సీ నగర్ నుంచి బేడబుడగ జంగాల కాలనీ వరకు సింగరేణి సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.5లక్షలు వెచ్చించి నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే దివాకర్‌రావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన అరుణక్కనగర్‌లోని ఇంటింటా పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, పార్టీ పట్టణాధ్యక్షుడు సుబ్బయ్య, వార్డ్ కౌన్సిలర్ మహేష్, నాయకులు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, డి.అన్నయ్య, ఎం.రాజేంద్రపాణి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి హారతి యాత్రను జయప్రదం చేయండి

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాలలో జూన్ 6న జరిగే గోదావరి హారతి యాత్రను జయప్రదం చేయాలని గోదావరి హారతి రాష్ట్ర కో కన్వీనర్, యాత్ర రూట్ ఇన్‌చార్జి కాత్యం వెంకటరమణ తెలిపారు. వేలాల గ్రామంలోని శ్రీ మల్లన్న స్వామి ఆలయం వద్ద మంగళవారం యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. జూన్ 3నుంచి 8వరకు కందకుర్తి(బాసర)నుంచి భద్రాచలం వరకు జరిగే యాత్రలో భాగంగా 6వ తేదీన యాత్ర వేలాల మీదుగా శివ్వారం నుంచి చెన్నూర్ మీదుగా వెళ్తుందన్నారు. భక్తులు యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రయంలో గోదావరి హారతి మండల కన్వీనర్ డేగ నగేశ్, ఒగ్గు పూజారులు చీర్ల గట్టయ్య, చీర్ల ఓదెలు, రాజేందర్, జాడి రాజాసమ్మయ్య, మాసినేని రవీందర్, అమిదాల మల్లయ్య, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు

తాండూర్: మండలంలోని ఐబీ కేంద్రం వద్ద సీఐటీయూ ఆవిర్భావ వేడుకలను మంగళవారం నిర్వహించగా, సీఐటీయూ మండల సహాయ కార్యదర్శి విజయలక్ష్మి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ.. కార్మికోద్యమాల చరిత్రలో సీఐటీయూకు ప్రత్యేకత ఉందన్నారు. కార్మికవర్గ పోరాటాలను అలుపెరుగకుండా నిర్వహిస్తోందని, హక్కులసాధనలో ముందుందని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విమర్శించారు.

క్లుప్తంగా

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేష్

లక్సెట్టిపేట: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశుధ్య కార్మికులకు పెంచిన రూ.1000 చెల్లించుట. రాబోవు వర్షాకాలంలో వర్షం నీరు నిలువ ఉండుటకు జేసీబీ వినియోగించుటకు నిర్ణయించారు. జూన్ రెండో తేదీ నుంచి నిర్వహించే దశాబ్ది, తెలంగాణ అవతరణ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయుటకు మున్సిపల్ పరిధిలో ఘనంగా నిర్వహించాలని ఆమోదించారు. ఇప్పటివరకు చేపట్టిన పనులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. నిధులు, ఖర్చులను కౌన్సిలర్లకు తెలియపర్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, మేనేజర్ శ్రీహరి, రాజశేఖర్, ఏఈ శృతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న బ్యాంకర్లు

చెన్నూర్: మున్సిపాలిటీ కార్యాయలంలో మైనార్టీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం నిరుద్యోగ యువతీ, యువకులకు బ్యాంకర్లు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. వివిధ రకాల యూనిట్ల కోసం 115మంది దరఖాస్తులు చేసుకోగా, ఇంటర్వ్యూలకు 91మంది యువతీ, యువకులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇంటర్వ్యూల్లో ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ నితిన్, యూబీఐ బ్యాంక్ మేనేజర్ సాగర్, టీజీబీ బ్యాంక్ మేనేజర్ బాస్కర్‌రెడ్డి, టీఎంసీ మల్లెపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

వేలం వాయిదా

చెన్నూర్: స్థానిక మదనపోచమ్మ ఆలయంలో పూజా సామగ్రి విక్రయం కోసం మంగళవారం నిర్వహించిన వేలానికి వ్యాపారులు హాజరుకాకపోవడంతో వాయిదా వేసినట్లు ఈవో రవి తెలిపారు. వేలంను జూన్ 6న నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు వేలంలో పాల్గొనాలని కోరారు.

నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంటాక్ట్'

చెన్నూర్‌రూరల్: నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నట్లు చెన్నూర్ సీఐ వాసుదేవరావు తెలిపారు. మండలంలోని బుద్దారంలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు గ్రామస్తులు సహకరించాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు స్వస్తి పలికి, మంచి మార్గంలో నడవాలని హితవు పలికారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు, అనుమానితులు ఎవరైనా వస్తే, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం యువతకు క్రీడా సామగ్రి అందించారు. ఆయన వెంట ఎస్సై మహేందర్, చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'అనుమతి లేని విద్యాసంస్థలు రద్దు చేయాలి'

మంచిర్యాలఅర్బన్: అనుమతులు లేని కార్పొరేట్ విద్యా సంస్థల గుర్తింపులను రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, తదితర విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీఈవో యాదయ్యకు వినతిపత్రం సమర్పించారు. అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మేఘన, మనోహర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం

వేమనపల్లి: తెలంగాణ అవతరణ దినోత్సవం, దశాబ్ది వేడుకలను పురస్కరించుకుని హరితహారంలో భాగంగా మొక్కలు నాటాలని ఎంపీడీఓ లక్ష్మయ్య అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధిహామీ పనిదినాలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ బాపురావు, ఏపీఓ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పట్టణ కమిటీ ఎన్నిక

చెన్నూర్: పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో మంగళవారం మాల మహానాడు జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కంబాల రాజేశ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్ట మధూకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాల కులస్తుల సమస్యలను చర్చించారు. అనంతరం చెన్నూర్ పట్టణ అధ్యక్షుడిగా కాపురపు నవీన్, పట్టణ ప్రధాన కార్యదర్శిగా రాదండి నవీన్‌ను నియమించారు.

సమస్యలు పరిష్కరించాలి

జన్నారం: అణగారిన వర్గానికి చెందిన బుడుగజంగాల సమస్యలను ప్రభుత్వం పట్టించుకొని పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వానరాసి సమ్మయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎనున్నకున్నారు.

విజయవంతం చేయండి

కాసిపేట: తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల విజయవంతానికి అధికారులు కృషి చేయాలని తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో ఎంఏ అలీం కోరారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

పోస్టర్ ఆవిష్కరణ

కాసిపేట: తెలంగాణ జనసమితి మూడో ప్లీనరీ జూన్ 4న సూర్యాపేటలో నిర్వహిస్తున్నట్లు, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజేఎస్ నాయకులు గోనెల శ్రీనివాస్, శ్రీలత కోరారు. మండలంలోని దుబ్బగూడెంలో మంగళవారం ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరించారు.

చెక్కు పంపిణీ

లక్సెట్టిపేట: మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన గంగయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజురు కాగా మాజీ ఏఎంసీ బియ్యాల తిరుపతి బాధితుడికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చుంచు రవి, నాయకులు నేరెల్ల సురేష్, లింగంపల్లి సత్తయ్య, తిరుపతి, కొట్టె గంగన్న, కమలాకర్, సుధాకర్ పాల్గొన్నారు.